క్లుప్తంగా

అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం



శ్రీనివాస్‌కు నగదు సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: పక్షవాతంతో అనారోగ్యం బారిన పడిన వ్యక్తికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు గురువారం రూ.13 వేల ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన వానపల్లి శ్రీనివాస్‌కి ఆరు నెలలు క్రితం పక్షవాతం వచ్చి కుడి చేయి, కాలు పనిచేయడం లేదు. అలాగే మాటా పడిపోయింది. ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం చేయిస్తున్నారు. వైద్యులు మందులు వాడాలని సూచించారు. అయితే పేదరికంతో మందులు వాడలేని పరిస్థితి వారిది. ఈ నేపథ్యంలో సాయం చేయాలని కాశీ అన్నపూర్ణ సేవా సంస్థ సభ్యులను కోరగా వారు శ్రీనివాస్ ఇంటికి వెళ్లి రూ.13 వేల నగదు సాయాన్ని అందజేశారు.

నేడు సూర్యారావుపేటలో జగనన్న సురక్ష

ఆలమూరు: మండలంలోని సూర్యారావుపేటలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఆలమూరు ఎంపీడీఓ కె.జాన్‌లింకన్, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి పి.భవానీశంకర్ తెలిపారు. వారు మాట్లాడుతూ స్థానిక గ్రామ సచివాలయం వద్ద నిర్వహించే ఈ జగనన్న ఆరోగ్య సురక్షలో నిపుణులైన వైద్యులు పాల్గొని ఉచితంగా వైద్య సేవలు, రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేయనున్నారన్నారు. పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

అంబాజీపేట: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయించాలని సర్పంచ్ కోట బేబీరాణి అన్నారు. చిరతపూడిలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను గురువారం ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పశువులకు వ్యాక్సిన్ వేయించాలన్నారు. కార్యక్రమంలో గుత్తుల వెంకటేశ్వరరావు, వెటర్నరీ అసిస్టెంట్ బి.ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేద్దాం.. ప్రాణాలు నిలుపుదాం



రక్తదానం చేస్తున్న యువకులు

మామిడికుదురు: ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి వారి ప్రాణాలు నిలపడం ఎంతో అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. మామిడికుదురు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో కోనసీమ బ్లడ్ డోనర్స్ నాలుగో వార్షికోత్సవ వేడుకను అధ్యక్షుడు కాంబ్రేగుల నరేంద్ర ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. రక్తదాన శిబిరంలో 60 మంది రక్తదానం చేశారు. ఈ బ్లడ్ మొత్తాన్ని అమలాపురం ఏరియా ఆసుపత్రి బ్లడ్ బ్యాంకు, బుద్ధాల నాగరత్నం బ్లడ్ బ్యాంకునకు అందించినట్లు నరేంద్ర, టీమ్, గ్రూప్ సభ్యులు తెలిపారు.

ఎన్టీఆర్‌కు నివాళి

అంబాజీపేట/ఆలమూరు: ఎన్టీ రామారావు 28వ వర్ధంతి సందర్భంగా గురువారం టీడీపీ మండల శాఖ ప్రధాన కార్యదర్శి గూడాల ఫణీల ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. పుల్లేటికుర్రులో దాసరి వీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలోను, నందంపూడి, కె.పెదపూడి గ్రామాల్లో వర్ధంతి నిర్వహించారు. ఆలమూరు మండలంలోని వివిధ గ్రామాల్లో మాజీ సీఎం ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. మండల టీడీపీ శాఖ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లోని పార్టీ శ్రేణులు ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు.

కుష్ఠ రోగులకు వస్త్రాలు, దుప్పట్ల పంపిణీ

అయినవిల్లి: జీఎంసీ బాలయోగి చారిటబుల్ సొసైటీ అయినవిల్లి మండల కన్వీనర్ అక్కిశెట్టి దుర్గారావు ఆధ్వర్యంలో గురువారం విలస న్యూలైఫ్ సెంటర్‌లో వస్త్రాలు, దుప్పట్లు, పండ్లు, రొట్టెలు, పంపిణీ చేశారు. అలాగే అన్నదానం చేశారు. కార్యక్రమంలో చిన్న తాసు, పోలిశెట్టి దేవి సతీష్, రుద్రాక్షల ప్రసాద్, బండారు సందీప్, పవన్, అమలకట్ల దొరబాబు, సాయ, ఏడీఆర్ ఫ్రెండ్స్ సర్కిల్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అమలాపురం రూరల్: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని బాలయోగి ఘాట్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మోకా రవికుమార్ గురువారం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ముమ్మిడివరం గేట్, ప్రభుత్వాసుపత్రి, విద్యుత్‌నగర్, సావరం, ఆర్డీవో ఆఫీస్ రోడ్, నల్లవంతెన, కలెక్టర్ ఆఫీస్, రూరల్ మండలంలోని జనుపల్లి, ఎ.వేమవరం, అయినవిల్లి మండలంలోని మాగం, నేదునూరు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

వామ్మో..చలి

- రాత్రి వేళల్లో తగ్గుతున్న ఉష్ణోగ్రతలు
- వేకువజామున విస్తృతంగా పొగమంచు
- తల్లడిల్లుతున్న వృద్ధులు, చిన్నారులు



చింతలూరులో చలిమంట కాగుతున్న యువకులు

ఆలమూరు: అసలే శీతాకాలం ఆపై చలి రోజురోజుకూ పెరుగుతుంది. వృద్ధులు, చిన్నారులపై పంజా విసురుతోంది. శీతాకాలం ప్రారంభమై నెలలు గడుస్తున్నా ఇప్పటివరకూ రాత్రి వేళల్లో చలి అంతంత మాత్రంగానే ఉంది. సంక్రాంతి ప్రారంభం నుంచి ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చలి ఉధృతమవుతుంది. దీంతో ప్రజలు రాత్రి సమయంలో ప్రయాణమంటేనే హడలెత్తి పరిస్థితి నెలకొంది. ఇటీవల ప్రతి రోజు సాయంకాలం ఏడు గంటల నుంచే చలిగాలులు అధికంగా వీస్తుండడంతో జనం గజగజ వణికిపోతున్నారు. పొద్దుపోయిన తరువాత ఉష్ణోగ్రతలు క్రమేపీ పడిపోవడంతో చలి తీవ్రత అంతకంతకూ పెరిగిపోతోంది. అలాగే అర్ధరాత్రి నుంచి ఉదయం ఏడు వరకూ మంచు కురుస్తుండటం చలికి కారణమవుతుంది. తలకు టోపీ, ముఖానికి మఫ్లర్‌తో పాటు శరీరానికి రక్షణగా స్వెట్టర్లు వేసుకుంటున్నప్పటికీ చలితీవ్రత నుంచి ఉపశమనం పొందలేకపోతున్నారు. ఇటీవల కాలంలో రాత్రి, ఉదయం వేళల్లో యువకులు నుంచి వృద్ధుల వరకూ చలి మంటలు వేసుకుని సేద తీరుతున్నారు. క్లస్టర్ పరిధిలోని కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల పరిధిలోని 11 మండలాల్లో గత వారం రోజులుగా రికార్డు స్థాయిలో 30 నుంచి 32 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోవుతున్నాయి. ఉదయం ఎనిమిది కావస్తున్నా సూర్యోదయం కాకపోవడంతో ప్రజలను చలి బెంబేలెత్తిస్తుంది. దీంతో ప్రజలు ఉదయం లేవాలంటే భయభ్రాంతులకు గురువుతున్నారు. ఏటా డిసెంబర్ రెండో వారం నుంచి చలి తీవ్రత పెరుగుతుంది. కానీ ఈ సంవత్సరం జనవరి రెండోవారంలో చలి తీవ్రత పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అనారోగ్య సమస్యలపై ఆందోళన

చలితీవ్రత వల్ల శ్వాసకోశ, ఆస్తమా, ఊపిరితిత్తులు సంబంధిత రోగులు ఈ చలికి తీవ్రతపై తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గత ఏడాదిని ఈ చలికాలంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి బయటకు వెళ్లే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యారోగ్యశాఖ విస్తృతంగా ప్రచారం చేస్తుంది. ఈ చలికాలం కచ్చితంగా వైద్య సూచనలు, సలహాలు పాటించాలని డాక్టర్లు కోరుతున్నారు. ప్రస్తుతం రబీ పనులు ముమ్మరంగా జరుగుతున్న తరుణంలో తెల్లవారుజామున పనులకు వెళ్లేందుకు కూలీలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చలి తీవ్రత తట్టుకోలేక ఉదయం సూర్యోదయం అయితే కాని కానీ పనులకు రావడం లేదని రైతులు వాపోతున్నారు.

శీతాకాలంలో తగిన జాగ్రత్తలు పాటించాలి



శీతాకాలంలో చలి ప్రభావం దృష్ట్యా ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లోను శరీరంపై మంచు పడకుండా చర్యలు తీసుకోవాలి. అవసరాన్ని బట్టి మాత్రమే రాత్రి వేళల్లో ప్రయాణించాలి. చలి తీవ్రత వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తితే సత్వరమే సమీప పీహెచ్‌సీలను సంప్రదించాలి. చలి తీవ్రత వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం.

– డి.సువర్చలాదేవి, పీహెచ్‌సీ వైద్యాధికారి, చొప్పెల్ల

విద్యా కార్యక్రమాలపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న సెక్టోరియల్ అధికారులు రాంబాబు, సుబ్రహ్మణ్యం

కొత్తపేట: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న విద్యాపరమైన కార్యక్రమాలపై సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు పి.రాంబాబు, బీవీవీ సుబ్రహ్మణ్యం, డి.రమేష్ బాబు, డాక్టర్ ఎంఎకే భీమారావులు సమీక్ష నిర్వహించారు. కొత్తపేట మండల విద్యాశాఖ కార్యాలయంలో గురువారం సీఆర్ఎంటీ లకు రివ్యూ సమావేశాన్ని నిర్వహించారు. ఎంఈఓ–2 కె.లీలావతి అధ్యక్షతన జరిగిన సమీక్షలో ఏఎంఓ పి.రాంబాబు, సీఎంవో బీవీ సుబ్రమణ్యం, ఆల్టర్నేటివ్ స్కూల్స్ కోఆర్డినేటర్ డి.రమేష్‌బాబు, ఏపీఓ డాక్టర్ ఎంఏకే భీమారావులు మాట్లాడుతూ ముఖ్యంగా సీఆర్‌ఎంటీలు క్షేత్రస్థాయిలో విద్యాపరమైన కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. విద్యార్థులు 2.0 నందు ప్రతి పాఠశాల ఎన్‌రోల్ అయ్యే విధంగా చూడాలని అలాగే ప్రభుత్వ పాఠశాలలకు అందజేసిన లైబ్రరీ పుస్తకాలను ఆన్‌లైన్ చేయాలని ఫిర్కి యాప్‌లో టీపీడీ మాడ్యూల్స్ సంబంధిత ఉపాధ్యాయులు పూర్తి చేసే విధంగా సీఆర్ఎంటీలు బాధ్యతలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రస్తుతం విద్యాశాఖలో అమలవుతున్న పథకాలు, కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో కొత్తపేట, ఆలమూరు, ఆత్రేయపురం, పి.గన్నవరం, రావులపాలెం, అయినవిల్లి మండలాలకు చెందిన సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.

గ్రామకంఠం సమస్యకు శాశ్వత పరిష్కారం



జీవో కాపీని బిళ్లకుర్రు ప్రజలకు, ఎంపీపీ మార్గన గంగాధరరావుకు అందజేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

కొత్తపేట: సాంకేతిక సమస్యల కారణంగా పలివెల, బిళ్లకుర్రు గ్రామాల గ్రామకంఠం భూములు దేవదాయ–ధర్మదాయ శాఖ ఆస్తులుగా నోటిపై కావడంతో ఎంతో కాలంగా సదరు ఆస్తులు అమ్ముకోవడానికి వీలుపడక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామస్తుల సమస్యను గ్రామస్తులు, ఎంపీపీ మార్గాన గంగాధరరావులు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ సంబంధిత దేవదాయ శాఖ అధికారులతో, ప్రభుత్వంతో తరచూ మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. ఫలితంగా ఈరోజు ఈ గ్రామ కంఠం సమస్య పరిష్కారానికి శాశ్వత పరిష్కారం చూపుతూ ప్రభుత్వం జీవో విడుదల చేయడం జరిగింది. గతంలో కూడా కొత్తపేట, వానపల్లి, వాడపాలెం గ్రామాల ప్రజలు ఇలాంటి సమస్యనే ఎదుర్కొన్నప్పుడు ఎమ్మెల్యే చొరవ చూపించి పరిష్కరించారు. ఈ విధంగా సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని ఆయా గ్రామాల ప్రజలు అభినందించి, వారి సంతోషాన్ని వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకుని పని చేసే నాయకులు చాలా అరుదుగా ఉంటారని జగ్గిరెడ్డి ఆ కోవలోకే వస్తారన్నారు. ప్రతిపక్షాలు ప్రజల సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేసే నాయకులపై పనికిమాలిన విమర్శలు చేయడం, ఉత్తర ప్రగల్భాలు పలకడం, కుట్రలు, కుతంత్రాలు చేయడం, ప్రతి విషయాన్ని రాజకీయంగా ఎలా వాడుకోవాలి అని చూస్తున్నారే తప్ప వేరే పని ఏమి ఉండడం లేదని విమర్శించారు.

చిరుధాన్యాల ఉత్పత్తిపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న మార్టేరు వరి పరిశోధన కేంద్రం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ భరతలక్ష్మి

అయినవిల్లి: మార్టేరు వరి పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో చిరుధాన్యాల ఉత్పత్తిపై గురువారం అవగాహన కార్యక్రమం మండలంలోని మాగాంలో నిర్వహించారు. మార్టేరు వరి పరిశోధన కేంద్రం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ భరతలక్ష్మి, సైంటిస్ట్ సుధీర్, పెద్దాపురం, ముమ్మిడివరం ఏరువాక కేంద్రం నుంచి వి.గౌరీ, బి.భవానీల ఆధ్వర్యంలో రైతులకు చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. భరతలక్ష్మి చిరుధాన్యాల ఉత్పత్తులపై ఇప్పుడు మంచి గిరాకీ ఉందని రైతులు వీటి సాగుపై మెళకువలు తెలుసుకోవాలన్నారు. చిరుధాన్యాల సాగుతో మంచి ఆదాయం సమకూర్చుకోవచ్చన్నారు. నేటి యువతరం రైతులు చిరు ధాన్యాలను సాగు చేయాలని ఆమె కోరారు. రబీ సీజన్‌లో చిరుధాన్యాల సాగు అనుకూలమన్నారు. చిరుధాన్యాలను ఆశించే చీడ పీడలపై యాజమాన్య పద్ధతులు, సాగులో మెళకువలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సైంటిస్టులు ప్రదీప్ కుమార్, జిల్లా వనరులు శాఖ ఏడీఏ ఎ.రాజశేఖర్, ఏఓ మనోహర్, ఏడీఏ ఎంఏ శంషీ, ఏవో శోభ, రైతు సంఘ నాయకులు పాల్గొన్నారు.

స్నేహబంధం ఎంతో మధురం



మొగలికుదురులో సమావేశమైన పూర్వ విద్యార్థులు

మామిడికుదురు: స్నేహ బంధం ఎంతో మధురమైనది. జీవితాంతం తరిగిపోదు.. చెరిగిపోదు.. చిన్ననాటి స్నేహానుబంధాన్ని మరోసారి ఆత్మీయ కలయిక ద్వారా పూర్వ విద్యార్థులు గుర్తు చేసుకున్నారు. మొగలికుదురు జెడ్పీ హైస్కూల్‌లో 1994–95లో పదో తరగతి విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని స్థానిక పాఠశాలలో సమావేశమయ్యారు. తొలుత ఒకరినొకరు పలకరించుకొంటూ ఆప్యాయతలు పంచుకొన్నారు. దూర ప్రాంతాల్లో ఉన్నప్పటికీ సమావేశానికి హాజరై స్నేహానికి ఉన్న విలువను చాటుకోవడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. చిన్ననాటి చిలిపిచేష్టలు, అల్లర్లను, నిక్‌నేమ్‌లను తలచుకుంటూ చిన్నపిల్లల్లా మారిపోయి సందడి చేశారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు.

23న అమలాపురంలో జాబ్ మేళా

అమలాపురం రూరల్: ప్రముఖ ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాల కోసం ఈ నెల 23వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి అమలాపురం ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తామని కోనసీమ జిల్లా ఉపాధి కల్పనాధికారి ఇ.వసంతలక్ష్మి తెలిపారు. జాబ్ మేళాలో ఎంపికైన వారికి రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకూ జీతం ఇస్తారన్నారు. ఇంటర్, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైనవారు అర్హులన్నారు. ఆసక్తి గలవారు తమ సర్టిఫికెట్లు, బయోడేటా జెరాక్స్ కాపీలతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఉపాధి కల్పనాధికారి వసంతలక్ష్మి కోరారు. మరిన్ని వివరాల కోసం 81218 38392 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

ప్రజల కనీస అవసరాలు తీర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ నాతిబుజ్జి

ఆత్రేయపురం: గ్రామ పంచాయతీల్లో ప్రజల కనీస అవసరాలైన తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు, రోడ్లు, మురుగునీటి కాల్వల నిర్వహణ వంటి సౌకర్యాలు కల్పించడంపై ప్రధానంగా దృష్టి సారించి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీఓ నాతిబుజ్జి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ కుండ అన్నపూర్ణ అధ్యక్షతన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2024–25కి సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయుటకు సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఆమె సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ వరప్రసాద్, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, మండల పరిషత్ పర్యవేక్షకులు టీవీ సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ వెలికితీసేందుకే క్రీడలు



ముక్తేశ్వరంలో క్రికెట్ క్రీడాకారులతో ఎంపీడీఓ శ్రీవెంకటాచార్య

అంబాజీపేట: యువతీ, యువకుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి అన్నారు. 'ఆడుదాం ఆంధ్ర'లో భాగంగా అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన కబడ్డీ పోటీలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత, మట్టపర్తి యజ్ఞశ్రీ వెంకటేశ్వరరావు, చింతపల్లి వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ కె.సత్యనారాయణ, ఎంఈఓలు కె.వెంకటేశ్వరరావు, ఎం.ప్రకాష్, హెచ్ఎం కడలి సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరులో..

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. మండలంలోని చొప్పెల్ల, మూలస్థాన అగ్రహారం గ్రామాల్లోని మైదానాల్లో ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ నేతృత్వంలో క్రికెట్ పోటీలు జరిగాయి. ఈ పోటీలకు 24 జట్లు ప్రాతినిథ్యం వహిస్తుండగా తొలి రోజు నిర్వహించిన ఈ పోటీల్లో నాలుగు మ్యాచ్‌లు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరం జెడ్పీ హైస్కూల్, ముక్తేశ్వరం బీఈడీఓ కళాశాలలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో క్రికెట్ పోటీలను ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య గురువారం ప్రారంభించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ క్రీడలపై ప్రతి యువకుడు ఆసక్తి కనబరిచాలన్నారు. యువత క్రీడాస్ఫూర్తి కలిగి ఉండాలన్నారు. క్రీడలతోనే మానసికోల్లాసం అలవడుతోందన్నారు. గ్రామీణ క్రీడలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమాల ద్వారా క్రీడలపై ఆసక్తి పెరుగుతోందన్నారు. కార్యక్రమంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, వ్యాయామోపాధ్యాయులు, పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

మనో వికాస కేంద్రంలో పండ్ల పంపిణీ

అమలాపురం రూరల్: సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు గిడుగు రుద్రరాజు జన్మదిన వేడుకల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రభాకరరావు ఈదరపల్లిలో హరి మనోవికాస కేంద్రంలో పండ్లు, స్వీట్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిడుగు రుద్రరాజు క్రమశిక్షణ కలిగిన నేత అని కొనియాడారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరు శ్రీనివాస్, ముషిణి రామకృష్ణరావు, పట్టణ అధ్యక్షుడు వంటెద్దు బాబీ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ నియామకం

అమలాపురం రూరల్: జిల్లాలో భారత విప్లవ కమ్యూనిస్టు పార్టీ నూతన కమిటీని పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి రంబాల సతీష్ అధ్యక్షతన ఈదరపల్లిలో గురువారం ఎంపిక చేశారు. జిల్లా కార్యదర్శిగా ముత్తబత్తుల నాగమణి, కమిటీ సభ్యులుగా కొట్టాల వెంకటరెడ్డి, మద్ద అనంతలక్ష్మి, చెయ్యవరపు పద్మావతి, కొట్టాల అనంతలక్ష్మి, బండి దుర్గా ప్రవీణ్, కొట్టాల అనిల్‌లు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి రంబాల సతీష్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు పాత్రికేయులతో మాట్లాడుతూ జిల్లాలోని ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామన్నారు.

నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు పార్టీ శ్రేణులు

పి.గన్నవరం: విజయవాడలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం జరిగే అంబేడ్కర్ విగ్రహావిష్కరణకి నియోజకవర్గం వర్గం నుంచి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు, అంబేడ్కర్ అభిమానులు తరలివెళ్తున్నట్టు పి.గన్నవరం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు తెలిపారు. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆయన వివరించారు. 14 బస్సులు, 50 కార్లలో విజయవాడకు వెళ్తున్నామన్నారు. శుక్రవారం ఉదయం 7 గంటలకు పి.గన్నవరం సెంటర్ నుంచి విజయవాడకు బయల్దేరనున్నట్టు విప్పర్తి వివరించారు.

సీఎంతోనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి



రామరాజులంకలో తాగునీటి పైపులైన్ల పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాపాక

మలికిపురం: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. గురువారం దిండి, రామరాజులంక గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ తాగునీరు పంపిణీకి పైపులైన్లు వేసే పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. జెడ్పీటీసీ బళ్ల ప్రసన్న కుమారి, ఎంపీపీ మేడిచర్ల సత్యవాణి, నాయకులు చింతా రాజబాబు, కె.అశోక్, నల్లి శివకుమార్, తాడి సహదేవ్, స్థానికులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం



మొగలికుదురులో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మామిడికుదురు: మొగలికుదురు శివారు బడుగువారిపేటలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా బడుగు వెంకటరమణ ఇల్లు అగ్నికి ఆహుతయింది. ఈ ప్రమాదంలో విలువైన వస్తువులు, గృహోపకరణాలు అగ్నిప్రమాదంలో కాలి బూడిదయ్యాయి. గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు రూ.10 వేల నగదును బాధితుడు వెంకటరమణకు అందజేశారు. కార్యక్రమంలో కడి శ్రీనివాస్, కొప్పిశెట్టి హేమసుందర్, తాడి శేఖర్, సిర్రా వెంకటేశ్వరరావు, కొల్లాబత్తుల మధువాసన్, కారుపర్తి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి



అంబాజీపేట శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ మమత

అంబాజీపేట: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి కోరారు. అంబాజీపేట ఎంపీపీ కార్యాలయంలో ఈఓపీఆర్డీ బి.మమత అధ్యక్షతన గ్రామాభివృద్ధి ప్రణాళిక తయారీపై సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు, పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం గ్రామ పంచాయతీల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై ఈఓపీఆర్డీ మమత, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీపతిలు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, ఎంపీటీసీల మండల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, సర్పంచ్‌లు కోట బేబీరాణి, నాగాబత్తుల శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నివాళులు



సొంపల్లిలో సత్యనారాయణ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాపాక

రాజోలు: మండలంలోని సోంపల్లి సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కట్టా శ్రీనివాస్ తండ్రి కట్టా సత్యనారాయణ గురువారం మృతి చెందారు. సత్యనారాయణ భౌతికకాయం వద్ద పూలమాలలు ఉంచి, ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు నివాళులర్పించారు. అనంతరం సర్పంచ్ శ్రీనివాస్‌ను, కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఓదార్చారు. వెంట పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తపేట: ముక్కామల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని మోడేకుర్రు పంచాయతీ ఏరియాలో కొత్త లైన్ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ గురువారం తెలిపారు. విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

CHANGE OF NAME

I seelam Balakrishna Jagannadham
S/o. Jagannadham,
D.No.7-44, Pedapalem,
Tottaramudi-533211, Inavilli Mandal
Dr. B.R.Ambedkar Konaseema Dist.
A.P. I Have Changed my Name from
Seelam Balakrihna Jagannadham (Old Name)
to Seelam Balakrishna Jagannadham (New Name)
Hence I am being called
Seelam Balakrishna Jagannadham
S/o. Jagannadham
for all purposes